# (వేదాంతి) చిట్టిగాడు

ముద్దా విశ్వనాథం గారు

ఒకరోజున ధర్మారావుదొరగారు స్వారి బయలుదేరినారు. దారిలో పువ్వులు కోతామని దిగినారు. ఆయన తిరిగి వచ్చేసరికి గుఱ్ఱం హుడాయించింది. "ఆగు, ఆగు, పంచకల్యాణీ" అంటూ పేరుపెట్టి గట్టిగా కేకలు వేశారు, దొరగారు. ఆగినట్టుండేది, ఆయన తీరా దగ్గఱకు వచ్చేటప్పటికి ఇట్టే పరుగెత్తేది. కొంతసేపటికి ఆపక్కన పొలంలో వున్న చిట్టిగాడు యిదంతా చూచి, గబుక్కున వెళ్ళి కళ్ళెం పట్టుకుని గుఱ్ఱాన్ని ఆపి, యజమానికి వప్పచెప్పాడు. ఈకుఱ్ఱాడి సుఖలక్షణాలు చూచేటప్పటికి మహాసంతోషమయింది ధర్మారావు గారికి. "అబ్బాయీ! మంచి తెలివితేటలతో పట్టుకున్నావోయి, మాగుఱ్ఱాన్ని. చాలా సంతోషించాం. నీకేం బహుమానం ఇయ్యగలం?" అని జేబులో చెయ్యి పెట్టినాడు.

"నాకేమీ వద్దండీ" అన్నాడు, చిట్టెయ్య.

ధ—వద్దూ? మరీ మంచిది. ఇల్లాగ ఎవరూ అనడం వినలేదు. సరే, నువ్వు పొలంలో ఏం చేస్తుంటావు?

చి—నేను కంపలు తవ్వుతున్నాను. గొఱ్ఱెలను కాస్తున్నా.

ధ—నీ కీపని సరదాగా వుంటుందా?

చి—ఓ.

ధ—పోయి ఆడుకోరాదూ?

చి—నా కీపని కష్టంగా లేదండీ, ఆటకంటె ఎక్కువ కులాసాగా వుంది.

ధ—నిన్నెవరు ఈపనిలో పెట్టారు?

చి—మాబాబు.

ధ—అతగాడేడీ?

చి—అల్లదుగో, ఆ చెట్ల మరుగున గుడిసెలో వున్నాడు.

ధ—అతని పేరు?

చి—కిష్టమ్మ.

ధ—నీపేరో?

చి—చిట్టిగాడంటారు, బాబూ.

ధ—నీ వయస్సు?

చి—రేపు సంకురాత్తిరికి ఎనిమిదేళ్ళు వెళతాయండి.

ధ—ఈపొలంలో ఎంతసేపటినుంచి ఉన్నావు?

చి—పొద్దుట ఆరుగంటల కొచ్చానండి.

ధ—మరి, నీకు ఆకలి వెయ్యటంలే?

చి—కాస్సేపుండి, గంజి కెళ్తానండి.

ధ—ఒరే కుఱ్ఱాడా! నీదగ్గఱ ఇప్పుడు ఆరణాలుంటే ఏం చేస్తావు?

చి—నాకు తెలవదు బాబూ. ఇదివఱకెప్పుడూ నాదగ్గ అంతసొమ్ము లేదండి.

ధ—నీకు ఆటవస్తువు లేమీ లేవూ?

చి—ఆటవస్తువులా? అవేంటి బాబూ?

ధ—గోళీకాయలు, బంతులు, బొంగరాలు, అలాంటివిరా.

చి—లేదండి. చెల్లికే కొన్నది మా మామ్మ, మొన్న తీర్థంలో, గంతులేశేకప్ప, నొక్కితే కూశే పిట్టలు, లక్క సామానులున్ను. నాకు ఆడుకుందికి ఒక గుజ్జంబొమ్మ వుండేది. అది విరిగిపోయిందండి.

ధ—అయితే నీ కేమీ వద్దూ?

చి—వద్దండి, దొరగారూ! రోజల్లాగొడ్లని మేపుకు వచ్చేటప్పటికే సరిపోతుంది. ఇదే నాకు సరదాగా వుంటుంది, ఆడుకోవడం కంటేను.

ధ—సరే, నీదగ్గఱ డబ్బుంటే పళ్లూ, అప్పచ్చులూ కొనుక్కో కూడదూ?

చి—అక్కఱలేదండీ, నాకు కావలసిన వన్నీ మా అమ్మ యిస్తుంది. అవ్వే చాలు.

ధ—పోనీ, పుల్లలు కోసుకునేందుకు ఒకచిన్న కత్తి వద్దూ?

చి—నాదగ్గఱ ఉందే? ఒకటి. మా అయ్య ఇచ్చాడు.

ధ—అయితే చూడు, నీచెప్పులు బొత్తుగా పాడైపోయిన ట్టున్నాయి. ఒకజత కొనుక్కోమ్మా.

చి—ఇంటిదగ్గఱ మరొక టుందండీ, పండుగల్లో వాడుకునేందుకు.

ధ—ఒరే చిట్టీ! నీతలగుడ్డంతా చినిగిపోయిందే?

చి—ఇంకా పాడైపోయిన తరువాత నెత్తి మాడుతుంది, బాబూ. అప్పుడు కొత్తది కొనుక్కుంటా.

ధ—అబ్బాయీ! వర్షం వస్తే ఏం చేస్తావురా?

చి—అల్లా మంచెకిందికి పోయి కూచుంటానండీ, వాన వెలిసేదాకా.

ధ—ఇంటికి వెళ్లకముందు ఆకలి వేస్తే ఏమిటి చేస్తావు, చిట్టెయ్యా?

చి—ఒక్కొక్కప్పుడు దుంప తింటానండి.

ధ—అదీ దొరక్కపోతేనో?

చి—నాకేం పరవా లేదండి, ఆ గొడవే తలపెట్టను.

ధ—మరివొచ్చి, ఈ వేసంగిలో నీకు దాహం వెయ్యదట్రా?

చి—ఆ చెలమలో ఉన్న నీళ్లు చాల్నండి.

ధ—హోరి చిట్టిగా! ఎంత వేదాంతివిరా?

చి—అయ్యా?

ధ—నువ్వు వేదాంతివి అంటున్నానురా— అంటే యేవిటో నీకు తెలియదు కాబోలు.

చి—తెలవదు బాబూ, తెలవకపోతే యిబ్బంది లేదుగదా?

ధ—లేదు, లేదు. (నవ్వును.) సరే, చిట్టెయ్యా! నీ కేమీ అక్కఱలేనట్టుంది. నీకు అవసరం కలిగించేందుకు సొమ్ము యేమీ యివ్వను లే. అయితే, నువ్వు బళ్లోకి వెళుతున్నావా?

చి—లేదండి. కోతలయిన తరువాత ప్రవేశ పెట్టిస్తా నన్నాడండి, మా అయ్య.

ధ—మఱి, నీ కప్పుడు పుస్తకాలు కావాలె కాదూ?

చి—అవునండి, బళ్లో అందఱికీ పేర్లు పుస్తకమున్నూ, ప్రార్థనపుస్తకమూ వున్నాయండి

ధ—సరే, నీకు నేను ఆపుస్తకాలు రెండున్నూ కొనియిస్తాను. నువ్వు సంతుష్టి గల కుఱ్ఱవాడివని సంతోషించాను. ఇల్లాగని మీబాబుతో చెప్పు. పో, నీ గోట్రాలు కాసుకో.

చి—చిత్తం, బాబూ, శెలవు తీసికొంటానండి.

ధ—మంచిది.

---

అజంతా చిత్రము



3. బింబిసారుని అంతఃపురము